రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ జంగిడివలస గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో రచ్చబండ నిర్మాణం కోసం ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత గురువారం భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రూ2 లక్షలలతో రచ్చబండ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ 20 లక్షల బడ్జెట్ తో వివిధ రకాల అభివద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వి జెమ్మ, గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డుమెంబర్స్ పి.సత్యనారాయణ, క్రిష్ణా, ఫీసా కార్యదర్శి మోస్య పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

1/70 చట్టం జోలికొస్తే సహించం

-స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళనలు

అరకులోయలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టం జోలికి వస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ హెచ్చరించారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఇతరుల అక్రమ కట్టడాలను అరికట్టాలని, సహజ వనరుల దోపిడిని నివారించాలని కోరుతూ గోరాపూర్ ఇసుక రీచ్ గడ్డ వద్ద గిరిజనులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విచ్చల విడిగా లాడ్జిలు, రిసార్ట్స్‌లు, పెద్దపెద్ద భవంతులు బినామీ పేర్లతో గిరిజనేతరులు చేపడుతున్న వాటిని అరికట్టడంలో రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తూ వారికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడడం సరికాదన్నారు. తక్షణమే ఆ వాక్యాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: 1/70 చట్టం సవరణ చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై నిరసిస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యాన గురువారం అరకులోయ మండల కేంద్రంలోని నాల్గు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మిలి చిన్నబాబు, మండల నాయకులు కిండంగి రామారావు మాట్లాడుతూ, రాజ్యాంగంలో కల్పించిన చట్టాలు పకడ్బందీగా అమలు చేసే విధంగా కృషి చేయవలసిన స్పీకర్ అయ్యన పాత్రుడు 1/70 చట్టంపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. .ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు కిల్లో జగన్నాథం, పాంగి రామన్న, పాంగి నాని బాబు, పాంగి బాలకృష్ణ పాల్గొన్నారు.

జి.మాడుగుల: అయ్యన్న వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం జి.మాడుగుల మండలం సులభం పంచాయతీ దబ్బగరువు గ్రామంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు, పంచాయతీ కార్యదర్శి సిదేరి చిన్నారావు మాట్లాడుతూ, 1/70చట్టం ఉండటంతో గిరిజన భూములకు రక్షణ ఉందన్నారు.. ఇది కాస్త మారిస్తే ఆదివాసీ ప్రాంతం సర్వనాశనం అయిపోతుందన్నారు.. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సిదేరి కళ్యాణం, చిక్కుడు శ్రీను, వంతల భాస్కరరావు, సిదేరి బుజ్జి బాబు పాల్గొన్నారు.

జికె.వీధిలో మాట్లాడుతున్న నాయకులు

డుంబ్రిగుడలో నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

సీలేరు: 1/70 చట్టాన్ని సవరించాలని ఎపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం జీకే వీధి మండల పరిషత్తు కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అపరంగి బుజ్జిబాబు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మురళి చంటిబాబు మాట్లాడుతూ స్పీకర్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గమ్మెల పరమేశ్వరరావు మురళ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల జోలికొస్తే ఖబడ్దార్

- సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: టూరిజం పేరుతో గిరిజనుల హక్కులు, చట్టాల జోలికి వస్తే ఖబడ్దార్ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు హెచ్చరించారు. గురువారం ఆనంతగిరి మండలంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పేరుతో గిరిజనుల చట్టాలను సవరించాలనే దుర్మార్గపు చర్యను మానుకోవాలని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు చెప్పిన మాటలు వేరని, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న కుట్రలు వేరని స్పష్టంగా ఆయన్న పాత్రుడు మాటల్లోనే తేలిపోయిందని చెప్పారు. టిడిపి ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా గిరిజన చట్టాలపైనే దాడులు చేయడం చేస్తుందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం 1/70 చట్టాన్ని సవరించాలని, ఎత్తివేయాలని ప్రయత్నం చేసినప్పుడు అప్పటి భద్రాచలం ఎమ్మెల్యే కామ్రేడ్ సున్నం రాజయ్య వ్యతిరేకించి ప్రజా ఉద్యమంతో కలిసి పోరాడి కాపాడడం జరిగిందని తెలిపారు.

అయ్యన్న వ్యాఖ్యలు సరికావు

పలువురు నేతలు

పెదబయలు: స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సి.పి ఎం మండల మండల కార్యదర్శి బొండా సన్నిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. స్పీకర్ స్థాయిలో ఇటువంటి వాఖ్యలు చేయకూడదని సరికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఒక టూరిజం పరిశ్రమ ద్వారానే సాధ్యమనే తప్పుడు అభిప్రాయం తో పాలకులు ఉన్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతోందని తెలిపారు. చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వాలే టూరిజం పేరుతో వందలాది ఎకరాల భూములను ఇప్పటికి ఆక్రమించారన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను ఆధ్వర్యాన సమావేశాన్ని గురువారం నిర్వహించారు .ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1/ 70 చట్టం ఆదివాసి గిరిజనులకు గుండె కాయ వంటిదన్నారు..ఆదివాసి గిరిజనులు ఏకమై ప్రాణాలు తెగించైనా కాపాడు కుంటామనీ తెలిపారు. .ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు ఎస్ గాసిరం దొర, నారాయణ పాల్గొన్నారు.

చింతపల్లి : గిరిజన ప్రాంతంలో సంపదను కొల్లగొట్టడానికి పాలకులు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నారని, అందులో మాటగానే శాసనసభ స్పీకర్. అయ్యన్నపాత్రుడు 1/70 చట్టం సవరణపై వ్యాఖ్యలు చేశారని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. గురువారం సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి. పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవితో కలిసి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి సిపిఎం రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకి సంసిద్ధమవుతామన్నారు. అనంతరం చిన్నయపడాల్ మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్లో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, ప్రభుత్వ రంగం ప్రత్యేక హెూదా, వంటి అంశాల ప్రస్తావన కూడా లేదని అన్నారు.

కొయ్యూరు : 1/70 చట్టం జోలికొస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఎం జిల్లా నాయకులు సరుమూర్తి సూరిబాబు హెచ్చరించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గిరిజన భవన్ ఆదివాసి జేఏసి సమావేశంలో మండల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయి పదవిలో ఉంటూ 1/70 చట్టాన్ని సడలింపు చేయాలని మాట్లాడం ఎవరికి మేలు చేయడానికని ప్రశ్నించారు. జెఎసి నాయకులు ఎస్.అశోక్ లాల్, నర్సి పాపారావు, ఎస్ సూరిబాబు, లవరాజు, సూరిబాబు, కృష్ణ, బాబూరావు, బూమయ్య, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన సభా వేదిక

అరకు చలి ఉత్సవాలకు సర్వం సిద్ధం

-నేటి నుంచి ప్రారంభం-పటిష్టంగా ఏర్పాట్లు -జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అరకులోయ: అరకు చలి ఉత్సవం 2025 ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం డిగ్రీ కళాశాల మైదానం ఉత్సవ వేదిక వద్ద అధికారులతో సమీక్షించారు. జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో చలి అరకు ఉత్సవం ఏర్పాట్లపై అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చలి అరకు ఉత్సవానికి సర్వం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అరుకు చలి ఉత్సవంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గిరిజన వంటకాలు, కాఫీ రుచులను పర్యాటకులకు రుచి చూపించాలని చెప్పారు. ట్రాఫిక్ కు ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రదర్శన స్టాల్స్, సౌండ్ సిస్టం, మారథాన్ ర్యాలీ , వాహనాల పార్కింగ్ ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉత్సవం మూడు రోజులు మెరుగైన పారిశుధ్యం పనులు చేపట్టాలని పంచాయతీ విభాగం అధికారులకు చెప్పారు. అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు. పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గిరిజన వంటకాలు ఏర్పాటు చేసి విక్రయించాలని సూచించారు. మొబైల్ సిగ్నల్ ఇబ్బందులు లేకుండా వీల్స్ ఆన్ సెల్ఫోన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. 31న ఉదయం 7 గంటలకు డిగ్రీ కళాశాల నుండి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు తిరిగి డిగ్రీ కళాశాల వరకు మారతాన్ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్ ,అదనపు ఎస్పీ ధీరజ్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ లు కె వేణుగోపాల్, జి.డేవిడ్ రాజు,డిఆర్డిఏ పిడి వి.మురళి, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బి ఎస్ నందు, జిల్లా ఉద్యానవనాధికారి రమేష్ కుమార్ రావు, డిపిఆర్ఓ పి.గోవిందరాజులు పాల్గొన్నారు.

స్టాల్స్ ఏర్పాటు

ఉత్సవ ప్రాంగణంలో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవ వేదిక సరికొత్త హంగులతో ముస్తాబవుతుంది. 31 న ఉత్సవ్ ప్రారంభం సమయంలో సర్వం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదర్శించారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయిందని అధికారులు తెలిపారు. పద్మాపురం గార్డెన్లో ఫ్లవర్ షోను నిర్వహిస్తున్నారు. ఇక్కడికి సమీపంలోని వజ్రాల కొండ సమీపంలో హెలిఫెడ్ వద్ద నుంచి హెలి రైడ్ నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో పాటు హెలి రైడ్, పార గ్లైడింగ్, ఫ్లవర్ షో, హార్ట్ హెయిర్ బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే హెలి రైడ్ ప్రారంభం కావడంతో పర్యాటకులు ముందుగానే టికెట్లు తీసుకుని ఆకాశంలో విహరిస్తు అనుభూతిని పొందుతున్నారు. ఉత్సవ నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా అల్లూరి జిల్లా ఎస్పీ నేతృత్వంలో స్థానిక సిఐ, ఎస్ఐలు ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాబ్‌మేళా వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సాయి ప్రశాంత్

రేపు రంపచోడవరంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-రంపచోడవరం : గ్రామీణ గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఫిబ్రవరి 1వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రంపచోడవరంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ తెలిపారు. స్థానిక డిఎస్పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1న జాబ్‌మేళాలో ఇన్నో సోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ వాళ్ళు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం పరిధిలోని వివిధ ప్రైవేట్ కంపెనీల్లో అర్హతను బట్టి ఉద్యోగాలు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. వీరికి జీతం రూ.18,950 వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, అర్హత కలిగిన అభ్యర్థులు తమ సమీపంలోని మహిళా పోలీసులకుగాని, పోలీస్ స్టేషన్లో గాని తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదు చేయించుకోబడిన అభ్యర్థులకు ఫిబ్రవరి ఒకటో తేదీన రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జాబ్ మేళా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. అభ్యర్థులు తమ వెంట విద్యా అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకుని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలోని మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు వేతన బకాయిలు, కూరగాయల బిల్లులు తక్షణమే చెల్లించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం చంటిబాబు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షులు కుమారి, దేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ కార్యాలయం ముందు మిడ్ డే మీల్స్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి మిడ్డే మీల్స్ కూరగాయలు బకాయిలు అధికారులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి మిడ్డేమీల్స్‌ను నిర్వహించాల్సి వస్తోందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి బకాయి పడ్డ వేతనాలు, మిడ్ డే మీల్స్ బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎంఇఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మిడ్డేమీల్స్ కార్మికులు

స్కూల్ శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-కూనవరం

స్కూల్ శానిటేషన్ కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. కూనవరంలో సోయం రజిని అధ్యక్షతన గురువారం జరిగిన శానిటేషన్ వర్కర్ల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ వేధింపులతో అతి తక్కువ వేతనాలతో పని చేసే కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందని, వేతనాలను సక్రమంగా చెల్లించకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్లు ఆందోళనలు చేస్తుంటే మూడు నెలలు ఆగండి రానున్నది.. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి వేతనాల బడ్జెట్ సాధించుకొని జిల్లా కేంద్రాలకు పంపించుకుంటే, జిల్లా అధికారులు కార్మికుల అకౌంట్స్‌లోకి వేతనాలు వేయడానికి రోజుల తరబడి తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. శానిటేషన్ కార్మికులకు నవంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను పూర్తిస్థాయిలో చెల్లించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్మికులందరికీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని, సమస్యలపై ఆందోళనకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు శ్రీను, కార్మికులు శ్రీదేవి, సీత, శారద, కిరణకుమారి, విజయలక్ష్మి, భూబమ్మ, భద్రమ్మ, లలిత, శెసమ్మ, నాగమణి, నాగ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలపై వ్యవసాయ అనుబంధ శాఖలతో గురువారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో పిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం తొలకరి నాటికి వ్యవసాయానికి సంబంధించిన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఫిబ్రవరి 5వ తేదీ నాటికి 100శాతం పశువులకు టీకాలు వేయాలని, పశువుల సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏజెన్సీలో గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయడానికి అర్హులైన వారి దగ్గర నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఏడు మండలాల్లో ఎన్ని చేపల చెరువులో ఉన్నాయో గుర్తిస్తే చేప పిల్లలు రైతులకు సరఫరా చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఏజెన్సీలో సాగునీటికి సంబంధించిన చెరువులు, పంట కాలువలు పూడికతీతలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కింద కొత్త పనులు మంజూరుకు నివేదికలు సమర్పించాలని సూచించారు. వివికెల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి వాటిని ప్రాసెసింగ్‌కు యూనిట్లును అడ్డతీగల, రంపచోడవరం మండలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, అసిస్టెంట్ డైరెక్టర్లు సూర్యనారాయణ, గణేష్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి చౌదరి, కే సావిత్రి, పిహెచ్ఓ కే చిట్టిబాబు, పిఏఓ ఎల్.రాంబాబు, ఎఓ కె.లక్ష్మణ్, అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు, ఉపాధి హామీ పథకం ఎపిఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కట్ట సింహాచలం

ఫైలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఫైలేరియాపై జిల్లా మలేరియా కార్యాలయం వారి ఆధ్వర్యాన గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు, ఏఎన్ఎంలే, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఏరియా హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్రీనివాసరాజు ఏఎంవో, ఎం చంటిబాబు, డిసి హెచ్‌ఎం ఎంటిఎస్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్పీలు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్

మావోయిస్టు అరెస్టు

ప్రజాశక్తి-ఎటపాక : ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధి విషాపురం పంచాయతీ చెరువు గుంపు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి పోజ్జ అలియాస్ లలిత్‌ను ఎటపాక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎటపాక పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వివరాలు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై ముందస్తు సమాచారంతో ఎటపాక పోలీసులు, సిఆర్పిఎఫ్ సిబ్బంది విషాపురం పంచాయతీ చెరువు గుంపు శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఆ సమయంలో సోడి పోజ్జ, ఇతర మావోయిస్టులు పోలీసులకు తారసపడ్డారు. దీంతో పోలీసులు వారిని పట్టుకొనే ప్రయత్నం చేయగా, సోడి పోజ్జ పట్టుబడగా, మిగతావారు తప్పించుకున్నారు. పట్టుబడ్డ సోడి పొజ్జ వద్ద నుండి ఒక గ్రానేడ్, కరపత్రాలు, రూ1000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా గొండిగూడ గ్రామానికి చెందిన సోడి పోజ్జ (24) 10 సంవత్సరాల వయసులో మావోయిస్టు పార్టీ అనుబంధ బాలల సంఘంలో చేరాడు. 2014లో మావోయిస్టు పార్టీలో చేరి కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2015లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం పెడమెల్ అటవీ ప్రాంతంలో పోలీసులతో ఎదురు కాల్పుల ఘటనలో ఆయన పాల్గొన్నాడు. 2017 గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో పోలీసులపై కాల్పుల ఘటనలో పాల్గొన్నారు. 2019లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం మోర్పర్ అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారు. ఈ ఘటనలో సోడి పొజ్జకు బుల్లెట్ గాయమైంది. నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించినా, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌సి అమిత్ బర్దర్ హెచ్చరించారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే.ధీరజ్, రంపచోడవరం ఓఎస్డి జగదీశ్ ఆడహళ్లి, డి141 బిఎన్ సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ చౌరాసియా, ఎటపాక సిఐ కన్నపరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూలి పనుల కోసం వెళ్లిన యువకుడు అదృశ్యం



ప్రజాశక్తి-కొయ్యూరు : కూలి పనుల నిమిత్తం వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ప్రకారం... ఏలేశ్వరానికి చెందిన బోడసింగి రాఘువ, సత్యవతి దంపతులు గత కొంతకాలంగా కొయ్యురు మండలం, ఎం.మాకవరం పంచాయతీ, నడింపాలెం గ్రామంలో కుటుంబంతో నివాసముంటున్నారు. వీరి మొదటి కుమారుడు దుర్గా ప్రసాద్ (25 సంవత్సరాలు) రెండేళ్ల క్రితం విశాఖపట్నంలో నూడిల్స్ పాయింట్ వద్ద జీతానికి చేరాడు. ఈ క్రమంలో విశాఖపట్నం హోటల్ యాజమాన్యం మంచిర్యాలలో ఉన్న హోటల్‌లో పని చేయాలని ఆదేశించడంతో దుర్గాప్రసాద్ మూడు రోజుల క్రితం రైలులో బయలుదేరి వెళ్లాడు. విజయవాడ చేరుకున్నాక అక్కడ నుంచి దుర్గా ప్రసాద్ ఆచూకీ లేకపోవడంతో ఆయన సహచరులు బంధువులకు, పోలీసులకు తెలియజేశారు. అయినా ఇంకా ఆచూకీ లభించలేదని తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గాప్రసాద్ ఆచూకీ తెలిసిన వారు 8121432121 నెంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

మాట్లాడుతున్న ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా

ప్రజాశక్తి-చింతపల్లి: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పి నవజ్యోతి మిశ్రా అన్నారు. గురువారం చింతపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో పేరణలో భాగంగా నిర్వహించిన జాబ్ మేళను సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మిస్ వినీత దెంక్లెతో కలిసి చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ అవకాశాలు పొంది కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఇన్నోవా, టాటా ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యా అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, బెంగళూరు చెన్నై వంటి ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసే యువతీ యువకులకు నెలకు రూ18 వేలు వేతనం కల్పించడం జరుగుతుందన్నారు. విశాఖపట్నం విజయవాడ హైదరాబాదు వంటి ప్రాంతాలలో నెలకు రూ 12 వేల నుంచి రూ15 వేలు వేతనంతో కంపెనీలలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు జికె వీధి సిఐలు పీవి రమణ, వరప్రసాద్, చింతపల్లి అన్నవరం ఎస్ఐలు వెంకటేశ్వరరావు, వీరబాబు, ఇన్నోవా కంపెనీ ప్రతినిధులు ఉన్నికృష్ణన్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

పనులను పరిశీలిసున్న సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు: సీతగుంట పంచాయతీ కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు వెంటనే సరపరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నీబాబు గురువారం ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. పెదబయలు మండల కేంద్రంలో సీత గుంట గ్రామపంచాయతీ పరిధి రోగుల గ్రామంలో గురువారం ఉపాధి కూలీల చేస్తున్న పని ప్రదేశంలో సందర్శించారు ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు పారా, పలుగు, గుణపం, మెడికల్ కిట్లు, పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం, టెంటు సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతుందన్నారు. ఇందులో భాగంగానే గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రోడ్లు , డ్రైనేజీల కాంట్రాక్టులకి ఇచ్చి పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రోగుల పేట పీసా కమిటీ కార్యదర్శి జంబు దేవరాజు, ఉపాధి హామీ కూలీలు పండన్న, భీమన్న, వణుకుం బుద్దన్న కొర్ర భీమన్న, బోనంగి సింహాద్రి పాల్గొన్నారు.

దర్జాగా అక్రమ కట్టడాలు

అక్రమంగా నిర్మాణం చేపడుతున్న కట్టడం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరచి గిరిజనేతరుల అక్రమ కట్టడాలను అరికట్టాలని ఒకపక్క గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తుంటే, మరోపక్క స్థానిక మండలంలోని అరకు సంత బయలు నేరేడువలస వీధిలో కెవిఆర్ బట్టల షాపు ఎదురుగా ఓ గిరిజనేతరుడు అరకు, పాడేరు ప్రధాన రహదారికి అనుకొని అక్రమ నిర్మాణం చేసుకుంటున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండానే సంబంధిత అధికారులు రాకపోకలు సాగిస్తున్నారు. అయినా గిరిజనేతరుల అక్రమ

▸▸ పట్టించుకోని అధికారులు

కట్టడాలను మాత్రం నిలుపుదల చేయడం లేదని స్థానిక గ్రామస్తులు అంటున్నారు. చదువుకున్న నిరుద్యోగ యువత బతుకుతెరువు కోసం రోడ్డు కిరువైపులా చిన్న చిన్న దుకాణాలు నిర్మించుకుంటే వెంటనే అక్కడ వాలి పోయి తొలగించే రెవెన్యూ అధికారులు, గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తక్షణమే అరకు నేరేడు వలసలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే నిలుపుదల చేయాలి:

అరకు సంత బయలు నేరేడు వలస వీధిలో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని వెంటనే నిలుపుదల చేయాలని గిరిజన సంఘం మండల నాయకుడు పి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రోడ్డు పక్కనే విచ్చలవిడిగా అక్రమ కట్టడం నిర్మాణం చేస్తున్నా సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు కంటికి కనబడకపోవడం విచారకరమన్నారు. తక్షణమే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో అందోళ చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

'సామర్థ్య' పేరిట గీతంలో అట్టహాసంగా 'జెమ్-25' ప్రారంభం

వేడుకలను ప్రారంభిస్తున్న లేక్‌మెన్ ఆఫ్ ఇండియా ఆనంద్

ప్రజాశక్తి -మధురవాడ: వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న గీతం ఎక్స్‌లెన్స్ మీట్ (జెమ్)-25 గురువారం అట్టహాసంగా ప్రాంభమైంది. బెంగళూరుకు చెందిన లేక్‌మేన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ప్రముఖ పర్యావరణ వేత్త ఎమ్.ఆనంద్ జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆక్రమణలు, నిర్లక్ష్యానికి గురవుతున్న నీటివనరుల పరిరక్షణలో యువత భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు మాట్లాడుతూ 33 ఏళ్లుగా నిర్వహిస్తున్న జెమ్ యువజనోత్సవాల్లో ఈఏడాది 'సామర్థ్య' పేరిట సంస్థల నిర్వహణలో. మానవ వనరులు, హెచ్ఆర్ మేనేజర్ల ప్రాధాన్యతను తెలిపే విధంగా సమ్మేళనాన్ని నిర్వహించామని వెల్లడిరచారు. విద్యార్థులకు వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల ే నిర్వహణ సామర్థ్యం పెంచడానికి జెమ్25 ఉపయోగ 'పడు తుందన్నారు. కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్.మిశ్రా, జెమ్‌కో సిఇఒ కె.చెర్రి హేడ్స్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కె.లుబ్జా నిహార్ పాల్గొన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు

బాధితులను ఆసుపత్రికి తరలిస్తున్న సీతారాం

ప్రజాశక్తి-చింతపల్లి : ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం వారిని ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే చింతపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతూ రహదారిపై జారిపడి పోయారు. దీంతో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. అదే సమయంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం వస్తుండగా గాయపడిన వారిని జి.మాడుగుల ఆసుపత్రికి తరలించారు.

చలి ఉత్సవాలు ఎవరి కోసం?

▸▸ ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: గిరిజనుల భాగ స్వామ్యం లేకుండా ఏర్పాటు చేస్తున్న చలి ఉత్సవాలు ఎవరి కోసమని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు ప్రశ్నించారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అరకు చలి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఇది కేవలం పర్యాటకుల ఆనందం కోసం జరుగుతున్నట్లు ఉందనీ తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం ఖర్చు పెట్టే నిధులు అరకు చలి ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారని విమర్శించారు.గిరిజన ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల అభిప్రాయాలు తీసుకోకుండా, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు భంగం కలిగే విధంగా చలి ఉత్సవాలు నిర్వహణ జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో మలేరియా, డయేరియాలతో మరణాలు పెరుగుతున్నాయని, ప్రతి ఏటా వేసవి కాలంలో త్రాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఐటీడీఏ పంచవర్ష ప్రణాళిక పెట్టి నిధులు వివిధ అభివద్ధి పనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో అనేక అటవిఉత్పత్తులు ఉన్నాయని ,అడ్డాకులు, చింతపండు, ఉసిరిసికాయ వంటివి ఉన్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య తీర్చవచ్చు అని తెలిపారు.ఏజెన్సీ మారుమూల గ్రామాలకు పాఠశాల భవనాలు లేక గిరి విద్యార్థిని, విద్యార్థులు అనేక ఇబ్బందులు చదువులు పడి చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు.గిరిజన గ్రామాల్లో మంచినీరు, రోడ్డు, విద్యా, వైద్యం కోసం ప్రత్యేక ప్రణాళికతో నిధులు కేటాయించి ఆదివాసి గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్రా మగ్గన్న, జన్ని భగత్ రామ్, కిండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసవానికి ఎన్ని పాట్లో..?

గర్భిణిని డోలీలో ఆసుపత్రికి తరలింపు

గర్భిణిని డోలీలో ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు: చెరువు వీధి గ్రామానికి చెందిన కిల్లో వనిత (29) గర్భిణికి గురువారం తెల్లవారు జాము నుండి పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. 108 వాహనానికి ఉదయం 9 గంటల సమయంలో సమాచారం చేరవేయగా మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల సమయంలో అంబులెన్స్ రావడంతో అప్పటికే నిండు గర్భిణీకి డోలి కట్టి సుమారు ఒక కిలోమీటర్ దూరం లో భుజాలపై మోసుకొని ఆసుపత్రికి తరలించారు. చెరువు వీధి, కొత్తూరు గ్రామాల్లో గత 30 ఏళ్ల క్రితం మట్టి రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఆ రోడ్డులో రాకపోకలు లేకుండా ముల్లకంచె వేయడంతో డోలి మోతే శరణ్యమయ్యింది.

నేడు 'మీ కోసం' రద్దు

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 31వ తేదీ శుక్రవారం జరగనున్న మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభమై 2వ తేది వరకు అరకు చలి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా మీ కోసం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వివరించారు. ఫిర్యాదుదారులు గమనించి ఫిర్యాదులు అందజేయడానికి రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కుళాయిల నుంచి తక్కువ ధారతో వస్తున్న నీరు

గ్రావిటీ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టరూ..

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామంలో గ్రావిటీ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. కమ్మరితోట గ్రామానికి గతంలో ఆర్డబ్ల్యూఎస్ ద్వారా గ్రావిటీ పైపులైన్ వేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. అయితే 2024 సెప్టెంబర్ 8న భారీ వర్షాలు, వరద బీభత్సానికి గ్రావిటీ పైపులైన్ ఉన్న ప్రదేశం కోతకు గురి కావడంతో పాటు పెద్ద పెద్ద బండరాలు పైపులైన్‌పై పడడంతో పైపులు పగిలిపోయాయి. అప్పుటి నుంచి మంచినీరు కుళాయిల నుంచి అరకొరగానే నీరు వస్తుంది. దీంతో కమ్మరి తోట గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా వచ్చి నీరు తాగునీటి అవసరాలకు, కాలకృత్యాలకు ఏమాత్రం సరిపోవడం లేదని పీసా కమిటీ కార్యదర్శి కిలో ధర్మారావు, పంచాయతీ వార్డు మెంబర్ కె.ఆంజనేయులు తెలిపారు. పైపులైన్లు మరమ్మతులు చేయాలని అనేకసార్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు దృష్టి తీసుకెళ్లిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి రాకముందే మంచినీటి కొరత ఏర్పడిందని, రానున్న రోజుల్లో మంచినీటి ఎద్దడి మరింత తీవ్రతరం కానుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ సర్పంచ్ నడిగట్ల రాజు, కార్యదర్శి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తక్షణమే గ్రావిటీ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించి, పూర్తి స్థాయిలో మంచినీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రెడ్డి లింగమూర్తి, కే ప్రసాదురావు, సి సత్యమూర్తి, ఆర్ బాబురావు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మెప్మా ఆర్‌పిలు గురువారం భారీ మానవహారం చేపట్టారు. తొలుత గాంధీ మహాత్ముని వర్ధంతి సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాత్మునికి ఎపి మెప్మా ఆర్‌పి ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నివాళ్లర్పించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సమయంలో చేసిన వాగ్దానం నెరవేర్చాలని గాంధీ మహాత్ముని సాక్షిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, వేతనాలు వ్యక్తిగత అకౌంట్‌లో జమ చేస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అమలు జరగనటువంటి ఈ మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను జివిఎంసి పరిధిలో అమలు చేస్తామని పీడీ సత్యవేణి చెప్పారని, అటువంటి సర్క్యులర్ అమలు ఆలోచనే లేదని ఎడిసి రమణమూర్తి చెబుతున్నారని, ఈ రకంగా రెండు రకాల మాటలు అధికారుల నుంచి రావడంతో ఆర్‌పిలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని ప్రైవేట్ కాలేజెస్, స్కూల్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం వద్ద బస్ డ్రైవర్స్‌గా పనిచేస్తున్న కెవి.రమణ, రెడ్డి, ఎస్ఎన్.రావులను తాగి వచ్చారనే నెపంతో తొలగించడం తగదన్నారు. అంతేగాకుండా రిటైర్ అయిన కార్మికులకు టెర్మినల్ బెనిఫిట్స్ ఇవ్వకుండా సదరు యాజమాన్యం చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు ఎక్కువ జీతం ఇవ్వాల్సి వస్తుందని చెప్పి కొత్త కార్మికులచే తక్కువ జీతంతో పని చేయించుకునే ఉద్దేశంతో ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నారని తెలిపారు.

15 రోజుల్లో వర్కింగ్ ప్లాన్

విశాఖ ఉక్కు పటిష్టమే మా లక్ష్యం : కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి
రూ.35 వేల కోట్ల అప్పులు తీరడంపై దృష్టిపెట్టాం
సమస్యలను పరిష్కరించండి : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతల విజ్ఞప్తి

మాట్లాడుతున్న మంత్రి కుమారస్వామి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఉక్కునగరం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, ప్రాణత్యాగాలతో ఈ కర్మాగారం ఏర్పాటైందని, ఈ క్రమంలో దీన్ని పటిష్టపరచడంపైనే దృష్టిసారించామని.. 15 రోజుల్లో వర్కింగ్ ప్లాన్ రూపొందిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి అన్నారు. గురువారం విశాఖ ఉక్కు పరిశ్రమలో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, స్టీల్ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సందర్భంగా కుమారస్వామి పలు విషయాలను ప్రస్తావించారు. ప్లాంట్ విస్తరణ కోసం బ్యాంకుల నుంచి చేసిన అప్పులు భారంగా మారాయని తెలిపారు. రూ.35 వేల కోట్ల మేర అవి పేరుకుపోయాయన్నారు. ప్రైవేటీకరణ జరగకుండా దీన్ని రివైవ్ చేసేందుకే తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇక్కడ కార్మికుల ఇబ్బందులు తమకు తెలుసని, ప్రస్తుతం వచ్చిన ప్యాకేజీ ఎలా వినియోగించాలో ప్లాన్ తయారు చేస్తున్నామని, దీంట్లో భాగంగానే ప్లాంట్‌లో తాము పర్యటించామని మంత్రి తెలిపారు. 3 నెలల్లో జీతాల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ ఏడాది జులై నాటికి 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభిస్తామన్నారు. చైనాతో భారత్‌ను పోటీకి నిలిపే సత్తా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఉందని తాము నిర్వహించిన సమీక్షల్లో తెలిసిందన్నారు.

2030 నాటికి దేశీయ స్టీల్ ఉత్పత్తి లక్ష్యం 300 మిలియన్ టన్నులు

2030 నాటికి దేశీయ స్టీల్ ఉత్పత్తిని 300 మిలియన్ టన్నులకు తీసుకెళ్లాలనేదే కేంద్రం లక్ష్యమని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ఈ సమీక్షలో వెల్లడించారు. ప్లాంట్ ఎదుర్కొనే సమస్యలపై తమకు అవగాహన ఉందని, కార్మికులు సహకరించాలని కోరారు. ఉన్నత స్థాయి సమీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల పాటు ఎలాంటి పన్నులూ లేకుండా ప్లాంట్‌కు సాయపడాలని కోరారు. నాలుగు నెలలుగా జీతాల్లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నైట్ సర్వీసు బస్సుల కొరతతో ఇక్కట్లు

విశాఖ నుండి భద్రాచలం వరకు నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి
రెండో నైట్ సర్వీసు పునరుద్ధరించాలని వేడుకోలు

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ప్రజాశక్తి-సీలేరు

విశాఖపట్నం నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులు కొరతతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. విశాఖ నుండి భద్రాచలానికి గతంలో రెండు నైట్ సర్వీసు బస్సులు ఉండేవి. అయితే 2024 సెప్టెంబర్ 8న భారీవర్షాలు, వరదలు కారణంగా లంకపాకల నుంచి సీలేరు వరకు ప్రధాన రహదారి కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా మారడంతో ఆర్టీసీ అధికారులు సుమారు 20 రోజులకు పైగా ఈ మార్గంలో బస్సు సర్వీసులను రద్దు చేశారు. రోడ్డు మరమ్మతుల అనంతరం విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సు ఒకటి పునరుద్ధరించారు. నాటి నుండి ఈ ఒక్కటే రాత్రి పూట ఈ మార్గంలో నడుస్తోంది. దీంతో సీట్లు సరిపోకా, మరో బస్సు లేక రాత్రి సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా బుధవారం రాత్రి విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్సు సర్వీసులో 40 సీట్లు ఫుల్ అయిపోగా, మరో 30 మంది ప్రయాణికులు విశాఖ భద్రాచలం వరకు నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది. సీట్లు లేక నిండు గర్భిణులు, చిన్నారులు నానా అవస్థలకు గురయ్యారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో నెట్ సర్వీస్ బస్సులను నడిపే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఏనుగుబయలులో భూముల రీ సర్వే

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగు బయలు గురువారం రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు దుమయంతి సత్యనారాయణ మాట్లాడుతూ జీకే వీధి మండలంలో 135 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, ఇందులో భాగంగా ఏనుగుబయలు గ్రామాన్ని క్షేత్రస్థాయి భూ స్థిరీకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్ చేయడం జరిగిందని చెప్పారు. ఈ గ్రామంలో 240 ఎకరాల 72 సెంట్లు భూమి ఉన్నట్లు గుర్తించామన్నారు. 56 సర్వేనెంబర్లలో 104 మంది పట్టాదారులు ఉండగా, ప్రభుత్వ భూమి 74 ఎకరాల 60 సెంట్లు, ప్రైవేట్ భూమి 166 ఎకరాల 12 సెంట్లు ఉందని నిర్ధారణ చేసినట్లు చెప్పారు. 110 సంవత్సరాల క్రితం రికార్డులను క్షుణ్ణంగా అధ్యయనం చేశామన్నారు. రీ సర్వే నిర్వహించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని, మ్యుటేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు బి.శ్రీను, విలేజ్ సర్వేయర్ రింకు సత్యనారాయణ, ప్రహ్లాదు, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో పార్టీల ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికుల నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడంతో మండలంలోని వివిధ పంచాయతీల్లో వివిధ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫెక్సీలు, ఫోటోలను అధికారులు గురువారం తొలగించారు. రాజేంద్రపాలెంలో వివిధ పార్టీల ఫ్లెక్సీలు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజబాబు, డిజిటల్ అసిస్టెంట్ కుమార్ నేతృత్వంలో తొలగించారు.

విశాఖ మార్కెట్‌లోకి హీరో మోటోకార్ప్ డెస్టినీ 125

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హీరో మోటోకార్ప్ నూతనంగా రూపొందించిన సరికొత్త డెస్టినీ 125 మోడల్‌కు చెందిన మూడు వాహనాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రీజనల్ డైరెక్టర్ వరా రవీంద్ర ఆవిష్కరించారు. గురువారం ఉదయం మద్దిలపాలెం సమీపంలోని శ్రీ హర్ష ఆటోమొబైల్ షోరూమ్‌లో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హీరో సంస్థ ఎన్నో ఏళ్లుగా పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ ధరల్లో వాహనాలను అందిస్తోందన్నారు. ఈ నూతన వాహనం వినియోగదారులను ఆకర్షిస్తుందని తెలిపారు. అనంతరం హీరో మోటో కార్ప్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అవినాష్ మాట్లాడుతూ ఈ నూతన డెస్టినీ 125 కుటుంబ సమేతంగా ప్రయాణించడానికి అనుకూలంగా రూపొందించబడిందని అన్నారు.

మాంగనీస్ ఓర్ హ్యాండ్లింగ్‌లో..
విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం పోర్టు సరుకు నిర్వహణలో మరో ఘనతను సాధించింది. విఎస్‌పిఎల్ బెర్త్ (ఈస్ట్ క్యూ 8) వద్ద ఈ నెల 29న ఎమ్‌విఎమ్‌బి ఎ వివా నౌకలో 22,746 మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఓర్ లోడింగ్‌ను పూర్తి చేయడం ద్వారా పోర్టు ఈ నూతన రికార్డు నెలకొల్పింది. తద్వారా గత ఏడాది ఆగస్టు 4న ఎమ్‌వి సోంనాథ్ నౌకలో ఈస్ట్ క్వే-7 వద్ద 22,359 మెట్రిక్ టన్నులు లోడ్ చేయడం ద్వారా నెలకొల్పిన రికార్డును తిరగరాసింది. బోత్ర షిప్పింగ్ సర్వీసెస్ ఏజెన్సీ చేపట్టిన ఈ మాంగనీస్ హ్యాండ్లింగ్ ద్వారా తక్కువ సమయంలో అధిక సామర్థ్యంతో కార్గో హ్యాండ్లింగ్ సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ రికార్డు విశాఖపట్నం పోర్టు సమర్థత, నిర్వహణ సామర్థ్యాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు.